# ఏక్సిడెంట్ .... ఏక్సిడెంట్

"జీవితమే ఒక ఏక్సిడెంట్ అన్నాడు ఓ కవి. ఆమె జీవితంలో ఒక ఏక్సిడెంట్ చీకటి తెరలు దింపితే, మరో ఏక్సిడెంట్ ఆ తెరలను తొలగించింది.

నాంచారమ్మ కొయ్యరాటకి జారగిలబడి విశ్రాంతిగా కూర్చుంది. వానలు వెనక బడ్డాయి. గాలిలో చల్లదనం పరచుకుంది. ఎండ తళ తళ మెరుస్తున్నా వేడి లేదు. నునువెచ్చగా మత్తుగా ఉంది.

అప్పుడే అన్నం తిని కూర్చుందేమో నాంచారమ్మకి నిద్ర ముంచుకొస్తోంది మూడు రోజుల క్రితం నేసిన కొత్త తాటాకు మీదనుంచి గాలి పచ్చి వాసనతో గమ్మత్తుగా ఉంది.

గతం, వర్తమానం కలగాపులగంగా కళ్లముందు కదులుతున్నాయి. ఎన్నేళ్ల క్రితమో పోయిన అమ్మ అప్పుడు గుర్తుకొస్తోంది ముప్పై ఏళ్లుగా బ్రతుకుతున్న జీవితం మూడు నెలల క్రితం పుటుక్కున తాడు తెగి తెర వాలిపోయింది. మళ్లీ తెర లేచేసరికి సరికొత్త జీవితం - సరికొత్త వాతావరణం.

* * *

పదేళ్ల నాంచారమ్మ ఆ రోజు నిద్ర లేచేసరికి ఒళ్లు వెచ్చగా ఉంది. ముత్యాలమ్మ కూతురి ఒంటిమీద చెయ్యేసి చూసి - "జొర వొచ్చింది. ఎందుకో....? జావ కాచిస్తా, తాగి పడుకో పనికి రావద్దులే మాపిటికి తగ్గిపోద్ది" అంది

అందుకని నాంచారమ్మ ఆ రోజు తల్లిదండ్రులతో పొలానికి పనికెళ్లలేదు. రెండేళ్ల తమ్ముడితో ఆడుకుంటూ ఇంట్లో ఉండిపోయింది. చీకటి పడేసరికి ఇంటికి రావాల్సిన అయ్యా, అమ్మా పొద్దుపోయినా రాలేదు. బిక్కు బిక్కు మంటూ గుమ్మంలో కూర్చుంది. పక్కింటి అలీసమ్మ తనకీ, తమ్ముడికీ అన్నం పెడితే తినేసి నులక మంచంలో తమ్ముడ్ని పడుకోబెట్టి, తను మాత్రం నిద్ర నాపుకుంటూ కూర్చుంది.

ఎంతసేపలా గడిచిందో - మధ్యలో నిద్రపోయే లేచిందో తెలీదు - వీరయ్య పరుగు లెట్టుకుంటూ వచ్చి గోల గోలగా చెప్పాడు

అమ్మా, అయ్యా ఎద్దు బండిమీద వస్తుండగా లారీ వచ్చి గుద్దేసింది. అక్కడి కక్కడే ఇద్దరితోబాటు ఎద్దు కూడా చచ్చిపోయింది.

తెలిసీ తెలియని వయస్సులో తగిలిన దెబ్బతట్టుకోలేకపోయిందా పసిప్రాణం తమ్ముడిని కౌగలించుకుని స్పృహ తప్పిపోయేలా ఏడ్చింది.

ఆ చచ్చిపోయిన అమ్మా, అయ్యల శవాలు కూడా చూడలేదు నాంచారమ్మ.

"పిల్ల జడుసుకుంటుంది. ఏముంది ? మాంసమ్ముద్ద" అని అందరూ ఆమెని చూడనివ్వలేదు.

ఆ రోజు నుంచీ అలీసమ్మ నాంచారమ్మ జీవిత రంగప్రవేశం చేసింది. దిక్కు లేకుండా మిగిలిన ఇద్దరు పిల్లల్ని చేరదీసింది. కూడు పెట్టింది.

అలీసమ్మకు మూడు గేదె లున్నాయి. పాల వ్యాపారం ఉంది. పిడకల అమ్మకం ఉంది. ఎకరం చెక్క ఉంది. అందువల్ల ఇంట్లో బోలెడంత పని ఉంది. అన్నిటికీ జీతం, బత్తెం ఇవ్వానవసరం లేని నాంచారమ్మ ఉంది.

పొద్దున్న అయిదు గంటలకి నిద్ర లేచే నాంచారమ్మ రాత్రి పది గంటల వరకు వంచిన నడుం ఎత్తకుండా పనిచేస్తుంది. ఏది పెడితే అదే తింటుంది. ఏ పని చెప్పినా నోరెత్తకుండా చేస్తుంది.

ఊళ్లో అందరూ అలీసమ్మ దయాగుణాన్ని పొగిడారు. "పని చేయించుకుంటే మాత్రం కూడెట్టాలని ఉందా?" అని లోకంలో ఉన్న నీతిని చెప్పారు.

"కూడు పెట్టినా దానికి మాత్తరం పెడతారు. అలీసమ్మ దాని తమ్ముడికి పోషనాకారం సూస్తోందిమరి" అంటూ మరి కొందరు వివరించారు.

తల్లిదండ్రులు పోయిన మూడేళ్లవరకు నాంచారమ్మ చేతులరిగిపోయేలా అలీసమ్మకి చాకిరీ చేసింది.

యౌవనాన్ని దారిద్ర్యం ఆపలేదు. మండుటెండల్లో మల్లెపువ్వు మరింత సొగసుగా విరియబూస్తుంది.

నాంచారమ్మ ఎదిగింది. పదమూడేళ్ళకి పదహారేళ్ల పిల్లలా కనిపిస్తోంది. నల్లగా నిగనిగలాడిపోతూ, బూరెల్లాంటి బుగ్గలు, బొద్దుగా, బలంగా చూసే వాళ్లని అందర్నీ ఇట్టే ఆకట్టుకుంటోంది.

లోకజ్ఞానం మెండుగా ఉన్న అలీసమ్మ జాగ్రత్తగా ఆలోచించటం మొదలు పెట్టింది. నలుగురు మనుషుల చేసే పని నాంచారమ్మ ఒక్కర్తీ చేస్తుంది. నిజమే! కానీ, పోను పోను కుర్రకారు నుండి ఆమెని కాపాడటం కష్టం. దిక్కు మొక్కూ లేనిదాన్ని ఎవడేనా ఎగరేసుకుపోతే తనేం చెయ్యగలదు? దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలి. ఆమె ఆలోచనలు పదునుగా సాగుతున్న సమయంలోనే అతను వచ్చాడు.

అతను - అలీసమ్మకి వరసకి తమ్ముడు నారాయణ. నలభై ఏళ్లన్నా నారాయణ కర్రపెండలం లాగా ఉంటాడు. బద్దలా, ముదిరిన ములక్కాడ లాగా కూడా ఉంటాడు. అతనికి నా అన్నవాళ్లెవరూ ఉన్నట్టు లేరు.... చదువు లేదు.... సంపాదనా లేదు .... బాదరబందీ లేదు.... భయమూ లేదు. లోకంమీద పడి

కొట్టుకుని తింటూ ఉంటాడు. ఏదో రకంగా డబ్బు సంపాదిస్తూ ఉంటాడు. అలాగని దొంగతనం చెయ్యడు. దోపిడీ చెయ్యడు.

అలీసమ్మ ఏం మంతనా లాడిందో తెలీదు. నాంచారమ్మని నారాయణకి అమ్మేసింది. వారి గుసగుసల మధ్య వ్యాపారమేదో జరుగుతోందని తెలుసు గానీ, వివరాలు పసికట్టలేకపోయింది. పసికట్టినా నిజానికి కామె చేయగలిగిందేమీ లేదు.

అది పెళ్ళి కాదు. అందులో అచ్చటా లేదు. ముచ్చటా లేదు.... ఈడూ జోడూ లేదు.... ఇష్టాయిష్టాల ప్రసక్తి లేదు.... గొడ్డుని అమ్మినట్లు అమ్మేసింది అలీసమ్మ. నాంచారమ్మకి వెళ్ళననే హక్కు లేదు ఉంటాననే ధైర్యమూ లేదు. ఆమె కసలు నోరే లేదు.

అయినా అయిదేళ్ళ తమ్ముడిని వదలలేక విలవిల్లాడిపోయింది. అందుకే కొంచెం ధైర్యంచేసి "పెద్దమ్మా! నన్ను ఎక్కడికి పంపేయకు" అంటూ భోరున ఏడ్చింది.

"ఏమోనే, తల్లీ! మంచి వయసుమీదున్నావు. ఎవడేనా తగులుకుంటే నే నా గొడవలు పడలేనే తల్లీ! ఏదో పుణ్యానికి ఇన్నాళ్ళూ కూడెట్టాను. ఆడైనా మనోడే, మంచోడే" అంటూ సాగదీసింది.

"నేనెంత పనైనా చేస్తా, పెద్దమ్మా! తమ్ముణ్ణి వదిలి నేనుండలేను" అంది ఏడుస్తూ.

ఏడ్చినట్టే ఉంది. మీ ఇద్దర్నీ కూచోబెట్టి మేపడానికి ఇక్కడ నేనేం రాసులు పోసుకుని కూర్చులేదు. ఎల్లు.... ఎల్లు.... ఇప్పుడు నీ కొచ్చిన కష్టవేం లేదులే. నీ తమ్ముడు ఇక్కడుంటాడులే" అంటూ దులిపింది.

నిజానికి నాంచారమ్మమీద పడి కొట్టడం కూడా అలీసమ్మకి అలవాటే కానీ, ఇప్పుడెక్కువగా గొడవ పెట్టుకోవడం, నలుగురి దృష్టిలో పడటం ఇష్టంలేదు.

నాంచారమ్మ కేంచెయ్యాలో తోచలేదు. తమ్ముణ్ణి తనతో తీసుకెళ్ళే స్వేచ్ఛ ఆమెకి లేదు. కన్నీరు కారుస్తూ నారాయణ వెంట వెళ్ళిపోయింది.

అయిదేళ్ళ తిరుపతి అక్క వెళ్ళిపోతుంటే అమాయకంగా చూశాడు. అప్పటికే కుడితి తొట్టెలో పొయ్యడం చేస్తున్నాడు అక్క ఏడుస్తుంటే తనూ ఏడ్చాడు.

* * *

నారాయణ అనుకున్న దొకటైతే ఎదురైంది మరోటి అతను మారు బేరానికి నాంచారమ్మను మంచి లాభానికి అమ్మదా మనుకున్నాడు. కానీ అతని దురదృష్టమో, ఆమె అదృష్టమో తెలీదు గానీ, అతనా పట్టణంలో అడుగు పెడుతూనే ఒక పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ కళ్ళలో పడ్డాడు. ఆ ఎస్.ఐ నిజాయితీ గల అధికారి కావడంతో, మొదటిచూపులోనే నారాయణలోనిఆలోచనా, నాంచారమ్మ లోని అమాయకత్వం గ్రహించాడు. నిఘా వేసి ఉంచాడు. ఆ ఎస్.ఐ.కి మొదటిలోనే 'నా భార్య' అని చెప్పుకోవాల్సి వచ్చింది నారాయణకి.

తర్వాత కొంత ప్రయత్నించినా పోలీసులంటే ఉన్న భయంవల్ల వెనక్కి తగ్గాడు. మనసు మార్చుకున్నాడు. మర్యాదస్తుడి వేషం వేసి, అప్పుచేసి గేదెలు కొని, పాల వ్యాపారం మొదలుపెట్టాడు. ఎందుకంటే ఆ వ్యాపారం నాంచారమ్మ మెళకువతో జాగ్రత్తగా చేసుకుపోగలదు గొడ్డులా చాకిరీచేసి, తనకి కూడు వండి పెట్టే నాంచారమ్మ దొరకడం అతనికి బాగానే అనిపించింది.

అనుకోకుండా ఒక రోజు నుండి నారాయణ ఆమెతో కాపురం చెయ్యడం మొదలు పెట్టాడు. దేనికీ ఎదురుచెప్పడం తెలీని ఆమె అతనికి సహజంగా తల వంచింది. అయితే, అలీసమ్మ కన్నా నారాయణలో ఎంతో కొంత మంచి తనం కనబడింది. ఇద్దరి మధ్యా శారీరక సంబంధం ఏర్పడటంతో అతని యందేదో హక్కు ఉన్నట్లు భావం కలిగేది. అది కొంత తృప్తినిచ్చేది.

కానీ మగాడయిన నారాయణకి అలాంటి భావం ఉండేది కాదు. తన అవసరాలన్నింటికీ ఆమె పనికొస్తున్నా, ఆమెని తరుచూ ఈసడించి పారేసేవాడు.

నాంచారమ్మకి పదిహేడేళ్ళు నిండేసరికి ఇద్దరు పిల్లలు పుట్టేశారు. రెండో సారి పిల్లాడితో డాక్టర్ని ఒప్పించి ఆపరేషన్ చేయించుకుంది.

పోనుపోను నారాయణలో ఓపిక చచ్చిపోయింది. అసలే పనిచేసే స్వభావం కాదు బాధ్యతలేదు. అందువల్ల మొత్తం సంపాదించి పోషించాల్సిన బాధ్యత నాంచారమ్మ మీద పడింది.

నాంచారమ్మ నోరెత్తితే మీదపడి కొట్టేవాడు. "కొని తెచ్చుకున్న ముండవి, నీకు తాళికట్టి భార్యహోదా ఇచ్చానే - నోరు మూసుకునిపడుండు" అంటూ రంకెలు వేసేవాడు.

ఎన్నిమాటలన్నా ఆమె పడేబాధకన్నా 'కొనుక్కుని తెచ్చుకున్నాను'

అన్నమాటకి వెయ్యి రెట్లు బాధపడేది. తను గొడ్డుకాదు. మనసున్న మనిషి. అతనికేం ద్రోహం చేసిందని తన్ని తగలేస్తున్నాడు. ఏదో అచ్చి ఉన్నట్లు అతనికోసం ఒళ్లు గుల్ల చేసుకుంటోందే .... అని బాధపడేదామె.

ఆ మాట పదేపదే వినడంవల్ల నాంచారమ్మకి నారాయణ మీద విపరీతమైన అసహ్యం దినదిన ప్రవర్ధమాన మవసాగింది ఇద్దరికీ పాతికేళ్లు తేడా ఉండటంవల్ల, ముసలివాడయిన నారాయణ పడుచు నాంచారమ్మని అనని మాట లేదు. బయట కెళ్లి పనిచేసుకోడానికి వీల్లేదు. సంపాదన కూడా అతని ఇష్టప్రకారమే జరగాలి. పాలవ్యాపారం అంతంత మాత్రంగా సాగుతోంది.

పదేళ్లు గిర్రున తిరిగాయి. ఎన్నో మార్పులు వచ్చాయి. పిల్లల బాధ్యతతో నారాయణ మిగిలాడు. సంపాదన పడిపోయింది.

నాంచారమ్మకి ఏ సుఖమూలేదు .... తిండి లేదు .... ప్రేమ లేదు.... పిల్లలిద్దరూ మాత్రం తల్లి నంటిపెట్టుకుని ఉండేవారు.

ఆ రోజు లేస్తూనే పెద్ద పెద్ద రంకెలు, కేకలు వేశాడు నారాయణ. కారణమేమీ లేదు. చేతకానితనం, అహంకారం.

కొన్నాళ్లగా సైకిలుమీద పొరుగున ఉన్న పల్లెకి వెళ్లి పాలు తెచ్చి ఇక్కడ వాడికలకి పోస్తున్నాడు. ఇంట్లో గేదె పాలతో కలిపి.

బయలుదేరుతూ - దారినపోతూ దరిద్రం తెచ్చి నెత్తినెట్టుకున్నాను. వెయ్యి రూపాయలు పోసి కొనుక్కున్నా నీ శనిగ్రహాన్ని నీవయసు చూపించి ఏదో ముతాకి అయిదు వేలకి అమ్మేసేవాడినే ఆ పోలీసు ముండాకొడుకు ఎవరూ దొరకనట్టు నా ఎంబటి బడ్డాడు అర్నెల్లు కాపేశాడు. నిగ నిగ లాడుతూ ఇంట్లో తిరుగుతుంటే, నిలువు గుడ్లేసుకుని సూస్తూ కూకోలేక నేనే మెడకి తగిలించుకున్నాను. నాల్రోజులు వాడుకుని ఇచ్చేద్దా మనిపించలే.... నెత్తిమీద శని అంతే!" పాత సైకిలు తీసి బిందెలు తగిలించుకుని వెళ్లిపోయాడు.

అతను వెళ్ళిపోతూ అన్నమాటలు చెవుల్లో అదే పనిగా మారు మ్రోగడం మొదలుపెట్టాయి. ఒక్కొక్క మాటా ఈటెలా గుండెలో గుచ్చుకుని సలపరించటం మొదలుపెట్టింది.

ఆక్రోశించే మనసుతో ఆమె అతన్ని నిర్దాక్షిణ్యంగా శపించింది.

'ఒక మనిషిని మరొక మనిషి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా - ఇకపై చెల్ల'దని మహాకవి అన్నమాటలు ఆమెకు తెలియవు కానీ. ఆమె హృదయాంతరాళాల్లోంచి అదే భావం పదే పదే పొంగింది.

ఇప్పుడామె అమాయకురాలు కాదు. ఎంతో జీవితాన్ని ఎందరో మనుషుల్ని చూసి జీర్ణించుకుంది. తన అమ్మా, అయ్యా చచ్చిపోయినప్పుడు, ఆ లారీవాణ్ణి పట్టి బెదిరించి అతని దగ్గర్నుంచి మూడువేలు చేజిక్కించుకుంది. అలీసమ్మ. గాడిద చాకిరీ చేయించుకుని డబ్బు చేసుకుంది పైగా తననొక మగాడికి బానిసగా అమ్మేసింది. ఇప్పుడీ నారాయణ తన మొగుడు కాదు. యజమాని. అతనంత అవమానించి హింసిస్తుంటే తనేం చెయ్యలేకపోతోంది.

రెండేళ్ళ క్రితం తిరుపతి వచ్చి అక్కని చూసి ఏడ్చి, ఆనందపడి ఎన్నో సంగతులు చెప్పాడు తను ఇంట్లోంచి పారిపోయి పట్నంలో కాఫీ హోటల్లో పరువుగా పని చేసుకుని బ్రతుకుతున్నానని చెప్పాడు. అప్పుడే లోకం పూర్తిగా అర్థమవడం మొదలుపెట్టింది నాంచారమ్మకి.

ఎత్తుగా ఎదిగిపోయిన బొద్దుమీసాల తమ్ముడ్ని వాటేసుకుని వాపోయింది. అప్పటినుంచి ఆమెలో కసి పెరిగిపోయింది.

ఈ రోజు నారాయణ మళ్ళీ అదేమాట అన్నాడు. 'కొనుక్కున్న మనిషిట' - తనకంటూ ఒక సౌఖ్యం, సరదా, మనసూ, మానం లేవా ?

ఆమె మనసు ఆ రోజు కుతకుత లాడిపోతోంది. బయటకెళ్ళిన నారాయణ మరింక తన కళ్ళబడకుండా ఉంటే బాగుండునని దుఃఖంతో నమ్మిన దేవుడికి మొక్కుకుంది

"దారిన పోయే దరిద్రం తలకి చుట్టుకున్నాను...." ఈ మాటలు ఆమె చెవుల్లో మళ్ళీ వినిపిస్తున్నాయి. తలలో సమ్మెటపోట్లు భరించలేకపోతోంది

*　　　*　　　*

బాగా చీకటి పడినా నారాయణ ఇంటికి తిరిగి రాలేదు. నాంచారమ్మలో బాధలేదు గానీ, ఆత్రత క్షణక్షణం పెరిగిపోతోంది.

అనుకున్నంతా అయింది ...అర్ధరాత్రి పక్కింటి పాపారావు వచ్చి చెప్పాడు.

సైకిలు మీద వస్తున్న నారాయణను బస్సు గుద్దేసింది.

అతనక్కడికక్కడే చచ్చిపోయాడు. శవం ధర్మాసుపత్రిలో వుంది.

మంత్రించినట్టు పరుగెట్టిందే గానీ, మనసు మొద్దుబారిపోయింది.

శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. తిరుపతి రాసిచ్చిన చీటీ పాపారావు కిచ్చింది. మర్నాడు దహనంచేసే సమయానికి తిరుపతి రానే వచ్చాడు వాణ్ణి కౌగలించుకుని ఆనందంతో వలవలా ఏడ్చింది నాంచారమ్మ.

ఎరుగున్న అందర్నీ పట్టుకున్నాడు తిరుపతి. ఆర్ టి సి. బస్సు కింద పడి చచ్చిపోయిన నారాయణ కుటుంబానికి ఇరవై అయిదువేలు వచ్చే అవకాశం ఉందని తెలుసుకున్నాడు - అదీ కోర్టు కెళ్ళకుండా సమాధానపడతామన్న హామీతో !

రెండు నెలలు ఆఫీసు చుట్టూ తిరిగాడు. పై అధికారి నుండి కింది గుమస్తా వరకు అందరూ ఎంతో సానుభూతితో వ్యవహరించారు.

నాంచారమ్మ చేతిలో పాతిక వేలు పడ్డాయి. ఆ ఒక్క క్షణం నారాయణ భార్య అయినందుకు కాస్త సంతోషపడింది. అందులోను కసే ఎక్కువ.

ఆమె దరిద్రం తీరింది. స్వేచ్ఛ వచ్చింది. అయిదువేలు పెట్టి కిళ్ళీ బడ్డీ తెరిచింది. ఇద్దరి పిల్లలకి చెరో అయిదు వేలు బ్యాంకులో వేసింది. మరో అయిదు వేలు తమ్ముడి పెళ్ళికోసం దాచింది.

మిగిలింది పై ఖర్చులుపోగా బట్టలూ, పాత్రలూ కొంది.

కూలిపోతున్న పూరిపాక గట్టిచేయించి కొత్తాకు నేయించింది.

పిల్లలకీ, తమ్ముడికీ కడుపు నిండా తిండి పెట్టి తనూ తింది.

కొయ్యి రాటకి జారగిలబడి కూర్చుంటే మత్తుగా ఉంటూ మనసు అనుకుంటోంది.

అమ్మా అయ్యా చచ్చిపోయిన, ఏక్సిడెంట్‌తో తన జీవితానికి పడిన తెర నారాయణ చచ్చిపోయిన ఏక్సిడెంట్‌తో తొలగింది.

మళ్లీ ఎన్నాళ్ళకో అమ్మా అయ్యా కళ్లలో మెదిలి చివ్వున కన్నీరు ఉబికింది.

19-2-'92 — (ఆంధ్రప్రభ)